సాక్షి
నంద్యాల
శుక్రవారం 3 మే 2024



వీనుల విందుగా..

శ్రీశైలంటెంపుల్: నిత్యకళావేదికపై గురువారం కర్నూలుకు చెందిన డి.లక్ష్మీమహేష్ బృందం నిర్వహించిన శివపార్వతుల కల్యాణంపై హరి కథ కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది.



మల్లన్న సేవలో..

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిని నంద్యాల జిల్లా సార్వత్రిక ఎన్నికల పరిశీలకులు ఎ.దినేష్‌కుమార్ గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.



నేత్రదానం

బేతంచెర్ల: పట్టణానికి చెందిన వాసవీ నప్లయర్స్ సుబ్రహ్మణ్యం (79) అనారోగ్యంతో మృతి చెందగా.. ఆయన కుమారులు తండ్రి నేత్రాలను ఐ బ్యాంక్‌కు దానం చేశారు.

న్యూస్‌రీల్

మద్యం అక్రమ నిల్వలపై సమాచారం ఇవ్వండి



ప్రభుత్వ మద్యం దుకాణంలో నిల్వలను పరిశీలిస్తున్న మణికంఠ

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఎక్కడైనా మద్యం అమ్మకాల్లో అక్రమాలు జరుగుతుంటే 7093781454 , 9440742440 నంబర్లకు సమాచారం ఇవ్వాలని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారి మణికంఠ తెలిపారు. గురువారం పట్టణంలోని పలు మద్యం దుకాణాల్లో ఆయన తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో మద్యం అక్రమంగా తరలిస్తున్నా, బెల్టు షాపులు నడుపుతున్నా సమాచారం ఇవ్వాలన్నారు. ఇందుకు సంబంధించి ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను 24 గంటలు అందుబాటులో ఉండేలా సిబ్బందిని నియమించామన్నారు. మద్యం దుకాణాల్లో ప్రతి రోజు నిల్వలు తనిఖీ చేస్తున్నామన్నారు. షాపులకు మద్యం సరఫరా చేసే వాహనానికి జీపీఎస్‌ను అమర్చామని, ప్రతి క్షణం వాహనం కదలికలను గమనిస్తున్నామన్నారు.

బ్యాంకు లావాదేవీలపై నివేదికలు ఇవ్వండి

నంద్యాల: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బ్యాంక్ లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతిరోజు నివేదికలు అందజేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు అన్ని బ్యాంకుల రీజినల్ మేనేజర్‌లకు సూచించారు గురువారం కలెక్టర్ చాంబర్‌లో బ్యాంక్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అనుమానాస్పద బ్యాంక్ లావాదేవీలపై నిరంతరం పర్యవేక్షిస్తూ సంబంధిత డేటాను ప్రతిరోజు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ద్వారా నివేదికలు అందజేయాలని రీజినల్ బ్యాంక్ మేనేజర్లకు సూచించారు. ఒకరి కన్నా ఎక్కువ రూ. 2 వేలకు పైగా నగదు లావాదేవీలు జరిపినట్లయితే సంబంధిత వివరాల డేటా ఇవ్వాలన్నారు. ఒక వ్యక్తి ఖాతా నుంచి లెక్కకు మించి ఇతరుల ఖాతాలోకి జమ అయితే ఆ వివరాలను ఇవ్వాలని సూచించారు. రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు బ్యాంకుల ద్వారా డబ్బు బదిలీపై డేటాలు నిత్యం సమర్పించాలని బ్యాంకర్లకు సూచించారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్ర కుమార్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ నరసింహారావు, అన్ని బ్యాంకుల రీజినల్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

జూన్ 21న ఆర్‌యూ స్నాతకోత్సవం

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం నాల్గవ స్నాతకోత్సవం (కాన్వకేషన్) జూన్ 21వ తేదీన నిర్వహించనున్నట్లు వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బి. సుధీర్ ప్రేమ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాజ్ భవన్ నుంచి ప్రాథమిక సమాచారం అందినట్లు పేర్కొన్నారు. గత ఏడాది సెప్టెంబర్ 4వ తేదీ ఆర్‌యూ కాన్వకేషన్‌కు ప్రకటన జారీ చేశామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ఉన్నత విద్యా మండలితో సంప్రదించి స్నాతకోత్సవ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

బ్యాలెట్ పేపర్ల ప్రింటింగ్‌ను త్వరగా పూర్తి చేయాలి

- పటిష్ట బందోబస్తు మధ్య సంబంధిత నియోజకవర్గాలకు పంపాలి



ప్రింటైన బ్యాలెట్ పేపర్లను పరిశీలిస్తున్న కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): బ్యాలెట్ పేపర్ల ప్రింటింగ్‌ను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె కర్నూలు ప్రాంతీయ ముద్రణాలయాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న ప్రింటింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలకు ఈవీఎంలపై అతికించే బ్యాలెట్ పేపర్లను కర్నూలులోనే ముద్రిస్తున్నట్లు చెప్పారు. ఏపీ నియోజకవర్గాల బ్యాలెట్‌పేపర్ల పూర్తి అయింది, ఎన్ని నియోజకవర్గాలకు బ్యాలెట్ పేపర్లను పంపారనే విషయాలను ప్రింటింగ్ ప్రెస్ , డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎల్.మోహన్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.

బాబుపై పండుటాకుల భగభగ

- చంద్రబాబూ మాపై మీకెందుకు పగ
- వలంటీర్ వ్యవస్థను రద్దు చేసి కష్టాలు తెచ్చిపెట్టావు
- నెలనెలా ఇంటి వద్దే పింఛన్ తీసుకునే వెసలుబాటు రద్దు చేయించావు
- నీవూ వద్దు.. నీ మోసపూరిత హామీలూ వద్దు
- మండిపడుతున్న పింఛన్ లబ్ధిదారులు

ప్రతి నెలా ఒకటో తేదీనే వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పండుగ వచ్చేది. ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి ఠంచన్‌గా పింఛన్ అందజేసేవారు. అవ్వాతాతల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసేది. మందులకు, ఇతర ఖర్చులకు నెలంతా ఎవరి దగ్గర చేయిచాపాల్సిన అవసరం ఉండేది కాదు. అయితే ఇప్పుడు ఒకటో తేదీ వచ్చిందంటే పింఛన్ లబ్ధిదారుల్లో ఆందోళన మొదలవుతోంది. గత నెలలో సచివాలయాలకు.. ఈ నెల బ్యాంకులకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తమను కష్టాలు తెచ్చిపెట్టిన టీడీపీ అధినేత చంద్రబాబుపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో బుద్ధిచెబుతామని హెచ్చరిస్తున్నారు.

కర్నూలు(అగ్రికల్చర్) /నంద్యాల(న్యూటౌన్): ''ఐదేళ్లు వలంటీర్లు ప్రతి నెలా మొదటి తేదీనే ఇంటికే వచ్చి పింఛన్ సొమ్ము ఇచ్చే వాళ్లు... ఐదేళ్లలో మొదటి సారిగా ఏప్రిల్ నెలలో చంద్రబాబు గ్యాంగ్ కారణంగా ఎర్రటి ఎండలో సచివాలయాల మెట్లు ఎక్కాం. సచివాలయాలకు రావడానికి ఇబ్బంది అయినప్పటికీ పింఛన్లు జాప్యం లేకుండా ఇచ్చారు. మళ్లీ ఈ నెలలోనే చంద్రబాబుకు ఏమి తోచిందో... ఏమో.. ఎండలు మరింత ముదిరిన తరుణంలో ఇపుడు ఏకంగా సుదూర ప్రాంతాల్లోని బ్యాంకుల మెట్లు ఎక్కేలా చేశారు. నీకేమి ద్రోహం చేశామయ్యా.. మమ్మల్ని ఇన్ని కష్టాలకు గురి చేస్తున్నావు'' అంటూ పండుటాకులైన అవ్వాతాతలు చంద్రబాబుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మే నెల పింఛన్ కోసం గురువారం ఉదయమే లబ్ధిదారులు బ్యాంకులకు పోటెత్తారు. చంద్రబాబు కుట్ర కారణంగా ఉమ్మడి జిల్లాలో 3,59,322 మంది పింఛన్‌దారులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు.

ఇవీ కష్టాలు..

ఈ నెల వృద్ధులు, వితంతువుల పింఛన్ నగదు బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. తీవ్రమైన ఎండల్లో పల్లెల నుంచి మండల కేంద్రాల్లోని బ్యాంకులు, కస్టమర్ సెంటర్లకు లబ్ధిదారులు చేరుకుని గంటల తరబడి నిలబడి కౌంటర్ దగ్గరకు వెళ్తే.. మీ బ్యాంకు ఖాతా ఇన్‌యాక్టివ్‌లో ఉంది.. ఆధార్, ఫొటోలు తీసుకురాపో.. అంటుండడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. కొందరు బ్యాంకుల వద్ద ఫారాలు పట్టుకుని బారులు తీరాల్సిన పరిస్థితి ఏర్పడింది. చాలా మంది పింఛన్‌దారులు సహాయకులు లేక ఇబ్బంది పడ్డారు. ఇదిలా ఉండగా పింఛన్ సొమ్మును ఎటువంటి బకాయిలకు జమ చేసుకోరాదని ప్రభుత్వం బ్యాంకులను ఆదేశించింది. ఎల్‌డీఎం కూడా ఉత్తర్వులు జారీ చేశారు. అయితే కొన్ని బ్యాంకుల్లో బకాయి పోగా లబ్ధిదారులకు రూ.200 నుంచి రూ. 300 ఇచ్చిపంపినట్లు తెలుస్తోంది. ఎంతో కష్టపడి పింఛన్ సొమ్ము కోసం బ్యాంకుకు వస్తే.. పాత బకాయికి జమ చేసుకున్నామని చెప్పడం పింఛన్‌దారులకు కన్నీళ్లు తెప్పించింది. ఈ తతంగం గ్రామీణ ప్రాంతాల్లోని బ్యాంకుల్లో ఎక్కువగా జరిగినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. బ్యాంకుల్లో రద్దీని తగ్గించుకునేందుకు సిబ్బంది బిజినెస్ కరస్పాండెంట్ల(బీసీ) దగ్గరకు పంపారు. బీసీలు సర్వీస్ చార్జీ కింద రూ.50 వసూలు చేసుకొని రూ.2950 ఇస్తుండటం గమనార్హం.



బేతంచెర్ల యూనియన్ బ్యాంక్ సేవా కేంద్రం వద్ద పింఛన్ నగదు కోసం బారులుదీరిన లబ్ధిదారులు



బేతంచెర్లలో మండు టెండలో పింఛన్ నగదు కోసం బ్యాంక్‌కు చేరుకుంటున్న వృద్ధులు

చంద్రబాబు కుట్రలతోనే ఇదంతా...

వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుండటంతో చంద్రబాబు శిష్యుడు నిమ్మగడ్డ రమేష్‌కుమార్ హైకోర్టును, ఎన్నికల కమిషన్ ఆశ్రయించారు. పింఛన్ల పంపిణీతో పాటు సంక్షేమ పథకాల అమలులో వలంటీర్లను దూరం పెట్టించారు. చంద్రబాబు చేసిన పాపం పింఛన్‌దారులకు శాపంగా మారింది. వలంటీర్లను దూరం చేయడంతో ఏప్రిల్ నెలలో సచివాలయాల దగ్గర పింఛన్లు పంపిణీ చేశారు. సచివాలయాల దగ్గర పింఛన్‌దారులకు ఇబ్బందులు ఏర్పడకుండా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకొని సాఫీగా పంపిణీ చేసే ఏర్పాటు చేసింది. అంతటితో ఊరుకోకుండా చంద్రబాబు ముఠా సభ్యుడైన నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ఏప్రిల్ నెల 26న పింఛన్‌లను బ్యాంకు ఖాతాలకు జమ చేసే విధంగా ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని ఎన్నికల కమిషన్‌ను కోరారు. ఈ విషయం విలేకరుల సమావేశంలోను చెప్పారు. ఇందుకు అనుగుణంగానే ఎన్నికల కమిషన్ ప్రభుత్వానికి సూచనలు ఇచ్చింది. ఈ మేరకు కర్నూలు జిల్లాలో 58,244 మందికి, నంద్యాల జిల్లాలో 51,187 మందికి డోర్‌టు డోర్ పింఛన్‌లు పంపిణీ చేసే విధంగా... మిగిలిన 3,59,322 మంది పింఛన్‌దారులకు డీబీటీ ద్వారా బ్యాంకు ఖాతాలకు పింఛన్ సొమ్ము బదిలీ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

2,95,057 పింఛన్లు డీబీటీ ద్వారా చెల్లింపు



పింఛన్ నగదు కోసం ఉయ్యాలవాడలో బిజినెస్ కరెస్పాండెంట్ల వద్ద నిరీక్షిస్తున్న వృద్ధులు

కర్నూలు జిల్లాలో డీబీటీ ద్వారా 1,88,104 మందికి పింఛన్ సొమ్ము బదిలీ చేయాల్సి ఉండగా... 1,55,254 మంది బ్యాంకు ఖాతాలకు జమ అయింది. నంద్యాల జిల్లాలో 1,71,218 మందికి గాను 1,39,803 మందికి జమ అయింది. ఉమ్మడి జిల్లా మొత్తంగా 3,59,322 పింఛన్లకు డీబీటీ ద్వారా బ్యాంకు ఖాతాలకు పింఛన్ సొమ్ము విడుదల కావాల్సి ఉండగా 2,95,057 మందికి జమ అయింది. మిగిలిన 64,265 బ్యాంకు ఖాతాల్లో ఉన్న సమస్యల కారణంగా జమ కాలేదు. వీరికి సచివాలయ ఉద్యోగులు శుక్రవారం బ్యాంకుల నుంచి పింఛన్ సొమ్ముడ్రా చేసి ఇంటింటికి వెళ్లి పంపిణీ చేస్తారు.



ఇంత కష్టపెడతారా..

ఈ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధురాలి పేరు రంగమ్మ. మండల కేంద్రం కొలిమిగుండ్లలోని పోస్టాఫీస్ సమీపంలో నివాసం ఉంటుంది. వయస్సు మీద పడటంతో పాటు కాలు విరగడంతో స్టాండ్ సాయంతో తీవ్రమైన ఎండలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌కు అతి కష్టంగా చేరుకుంది. ఓ వైపు ఎండలకు తాళలేక పోతేంటే మరో వైపు పింఛన్ కోసం ఇంతలా కష్టపెడుతున్నారని కన్నీటి పర్యంతమైంది. గతంలో ఇంటికి వచ్చి ఇచ్చే వాళ్లని, రెండు నెలల నుంచి ఇబ్బందులు పెడుతున్నారని వాపోయింది. – కొలిమిగుండ్ల

మళ్లీ పాత రోజులు గుర్తుకొచ్చాయి



ఐదేళ్ల పాటు ఇంటి వద్దనే వలంటీర్లు పింఛన్లు అందజేశారు. ఇప్పుడు రెండు నెలల నుంచి పింఛన్ సొమ్ము తీసుకునేందుకు అవస్థలు పడుతున్నాం. మే నెల పింఛన్లను బ్యాంకు ఖాతాల్లో వేయడంతో డబ్బులు తీసుకునేందుకు పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. 2019 సంవత్సరానికి ముందు పడిన కష్టాలు గుర్తుకొచ్చాయి. పింఛన్ల పంపిణీలో చంద్రబాబు మాలాంటి వృద్ధులపై కక్ష కట్టడం సరికాదు. – నారాయణ, పింఛన్ లబ్ధిదారుడు, సొదరదిన్నె, కోవెలకుంట్ల మండలం

ఎందుకు ఇలా చేస్తున్నాడో



వలంటీర్ ద్వారా వేరుగా ఇంటికే ఒకటో తేదీన పింఛన్ ఇస్తుంటే టీడీపీ నాయకులు ఎందుకు అడ్డుకున్నారో తెలియడం లేదు. ముసలోళ్లు బ్యాంకులకు వెళ్లి పింఛన్ తెచ్చుకోవాలంటే ఆటో ఖర్చులు ఎవరు ఇస్తారు. నాకు గోస్పాడు బ్యాంక్‌లో ఖాతా ఉంది. అందులో నా పింఛన్ డబ్బు వేశారని సచివాలయ సిబ్బంది చెప్పారు. వెళ్లాలంటే నాకు కొంత ఇబ్బందిగా ఉంటుంది. ముసలోళ్లను ఇలా ఇబ్బంది పెట్టే వారికి ఓటుతో గుణపాఠం చెబుతాం. – సెబాస్టిన్, పసురపాడు, గోస్పాడు మండలం

బాబు ఎంత పని చేశావయ్యా..



మా మనవడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాటు పింఛన్ సొమ్ము కోసం ఎప్పుడూ ఇబ్బంది పెట్టలేదు. ఠంచన్‌గా ప్రతి నెల 1వ తేదీన వలంటీర్లు ఇంటికి తీసుకువచ్చి ఇచ్చేవారు. చంద్రబాబు చేసిన పనికి పింఛన్ తీసుకునే వాళ్లంతా ఇబ్బందులు పడుతున్నాం. బాబుకు మా ఉసురు తగులుతుంది. వలంటీర్లు పింఛన్ పంపిణీ చేయకుండా అడ్డుకోవడం దారుణం. పింఛన్ తీసుకునేవాళ్లంతా ఎన్నికల్లో టీడీపీకి బుద్ధి చెబుతారు. – చింతా సుశీలమ్మ, వెంకటలక్ష్మమ్మ, ఉయ్యాలవాడ

ఆధార్ లింక్ కాలేదట



వలంటీర్లను రాకుండా చంద్రబాబునాయుడు అడ్డుకోవడం బాధాకరం. నాకు ఆత్మకూరు బ్యాంక్‌లో అకౌంట్ ఉండటంతో పొద్దునే పోయా. రెండు గంటల పాటు క్యూలో ఉండి అడిగితే నా బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ లింక్ కాలేదని పింఛన్ ఇవ్వలేదు. ఇప్పుడు ఎవరినీ అడిగాలో దిక్కు తోచడం లేదు. చంద్రబాబుకు పేదలు బాగుపడితే సహించదు. కరివేన నుంచి ఆత్మకూరుకు వచ్చిపోవాలంటే రూ. 50 ఖర్చు అవుతుంది. – వెంకటలక్ష్మమ్మ, కరివేన, ఆత్మకూరు మండలం

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ

- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాసులు



నంద్యాల: సార్వత్రిక ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాసులు వెల్లడించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఎన్నికల నిర్వహణ, సీజర్ మేనేజ్‌మెంట్, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ.. జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. నామినేషన్ల ప్రక్రియ, స్క్రూటినీ, పరిశీలన ముగిసిన అనంతరం బరిలో ఉన్న అభ్యర్థులకు గుర్తింపు చిహ్నాలు ఇవ్వడం జరిగిందన్నారు. నంద్యాల పార్లమెంట్ బరిలో 31 మంది అభ్యర్థులు, జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలలో 16 మంది కన్నా ఎక్కువ మంది అభ్యర్థులు పోటీ చేస్తున్న నేపథ్యంలో అన్ని పోలింగ్ బూతులలో రెండు బ్యాలెట్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాకు అదనపు బ్యాలెట్ యూనిట్లు వచ్చాయని శుక్రవారం నుంచి కమి షన్ ఆఫ్ ఈవీఎంస్ పూర్తి చేసి సంబంధిత నియోజకవర్గాలకు చేరవేస్తామ న్నారు. ఇందుకు సంబంధించి స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాలకు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఐదు ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు

పోస్టల్ బ్యాలెట్‌కి సంబంధించి అత్యవసర సర్వీసులకు చెందిన 17 వేల మంది సిబ్బంది నుంచి ఫార్మ్-12డి దరఖాస్తుల స్వీకరించామని కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు అన్ని అసెంబ్లీ నియోజకవర్గంలో ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. ఈ నెల 5, 6, 7 తేదీలలో ఆళ్లగడ్డలో వైపీపీఎం గవర్నమెంట్ హైస్కూల్, నంద్యాలలో ప్రభుత్వ జూనియర్ కాలేజ్, బనగానపల్లెలో గవర్నమెంట్ జూనియర్ కాలేజ్, నందికొట్కూరులో జెడ్పీహెచ్‌ఎస్ గర్ల్స్ హై స్కూల్, డోన్‌లో జెడ్పీహెచ్‌ఎస్ గర్ల్స్ హైస్కూల్‌లో పోస్టల్ బ్యాలెట్‌ల కోసం ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సి-విజిల్ యాప్ ద్వారా వచ్చిన 225 ఫిర్యాదులన్నిటిని పరిష్కరించామన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

- జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి


నంద్యాల(అర్బన్): ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ఓటర్లు పెద్ద ఎత్తున పాల్గొని ఓటు హక్కును వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి గాంధీ చౌక్ వరకు ఓటు హక్కుపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించామన్నారు. 2019 ఎన్నికల్లో నంద్యాల పట్టణంలో 70 శాతం పోలింగ్ జరిగిందని, ఈ విడత ఎన్నికల్లో 85 నుంచి 90 శాతం పోలింగ్ కావాలని సూచించారు. మద్యం, నగదు ఇతర ప్రలోభాలకు ఓటర్లు గురికాకుండా తమ ఓటు హక్కును జాగ్రత్తగా వినియోగించుకోవాలన్నారు. 18–19 సంవత్సరాల మధ్య వయసున్న ఓటర్లుగా నమోదు చేసుకున్న వారందరూ పోలింగ్‌లో పెద్ద ఎత్తున పాల్గొనాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులతో ఓటర్ స్లిప్‌లు ఇంటింటికీ పంపిస్తామన్నారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్న అధికారులు ప్రజలందరి చేత ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

నిప్పుల వర్షం

- బనగానపల్లి, డోన్‌లో 46.7 డిగ్రీలు
- కర్నూలు, గూడూరుల్లో 45.3 డిగ్రీల ఉష్ణోగ్రత



కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి జిల్లాలో నిప్పుల వర్షం కురుస్తోంది. గురువారం భానుడు మరింత ఉగ్రరూపం దాల్చాడు. నంద్యాల జిల్లాలో 29 మండలాలు ఉండగా.. ఏకంగా 22 మండలాల్లో హీట్ వేవ్ నమోదైంది. కర్నూలు జిల్లాలో గూడూరు, కౌతాళం మండలాల్లో హీట్ వేవ్ నమోదు కావడం గమనార్హం. వడగాడ్పుల తీవ్రతకు వృద్ధులు, బాలింతలు, గర్భిణిలు, చిన్న పిల్ల లు, రోగులు అల్లాడుతున్నారు. నంద్యాల జిల్లాలోని 8 మండలాల్లో 46 డిగ్రీలపైన, 10 మండలాల్లో 45 డిగ్రీలకు పైన, 4 మండలాల్లో 44 డిగ్రీలకుపైన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బనగానపల్లి, డోన్‌లలో 46.7, ఆళ్లగడ్డలో 46.6, మహానందిలో 46.4, నందికొట్కూరు, సంజామలలో 46.3, దొర్నిపాడు, కోవెలకుంట్లలో 46.1, పాణ్యంలో 45.9, మిడుతూరులో 45.9, బండిఆత్మకూరులో 45.7, శ్రీశైలంలో 45.6, రుద్రవరంలో 45.5, పగిద్యాలలో 45.3, ఆత్మకూరు, చాగలమర్రిలో 45.2, కొత్తపల్లిలో 45.1, శిరువెళ్లలో 45, గడివేములలో 44.9, పాములపాడు, అవుకులో 44.7, నంద్యాలలో 44.6 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ మండలాల్లో హీట్‌వేవ్ నమోదైనట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు వెల్లడించారు. కర్నూలు జిల్లా గూడూరు, కర్నూలులో 45.3, కౌతాళంలో 44.9, ఎమ్మిగనూరులో 44.5, కోడుమూరులో 44.4 సి..బెళగల్‌లో 44.1 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రెండు రోజుల్లో ఆళ్లగడ్డ, దొర్నిపాడు, నంద్యాల, కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, గోస్పాడు మండలాల్లో హీట్‌వేవ్ నమోదయ్యే అవకాశం ఉంది.

ధైర్యాన్నిచ్చి.. ప్రాణాలు నిలిపి

- కరోనా కష్టకాలంలో ప్రజలకు భరోసా కల్పించిన బుగ్గన
- సొంత నిధులతో ప్రజలకు మాస్కులు, శానిటైజర్ల పంపిణీ
- డోన్ ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు
- నాడు పత్తాలేని 50 ఏళ్ల రాజకీయ ఉద్దండులు



లాక్‌డౌన్ సమయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి బుగ్గన



ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్

డోన్: ప్రజా క్షేత్రంలో ఉన్న రాజకీయ నేతలు ప్రజల యోగ క్షేమాల కోసం బాధ్యతాయుతంగా పనిచేయడం కనీస ధర్మం. కరోనా వైరస్ మహమ్మారి ప్రపంచాన్ని భయపెడుతున్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. అదే సమయంలో డోన్ నియోజకవర్గ ప్రజలకు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ధైర్యాన్ని ఇచ్చి ప్రాణాలు నిలిపారు. లాక్‌డౌన్ సమయంలో కూడా వీధివీధికి తిరిగి ప్రజల్లో నెలకొన్న ఆందోళనను పారద్రోలేందుకు ప్రయత్నించారు. కరోనా వైరస్ మూలంగా పిట్టల్లా రాలిపోతున్న ప్రజలను కాపాడేందుకు ప్రభుత్వం మండలానికి ఒక క్వారంటైన్ ఏర్పాటు చేయగా, మంత్రి బుగ్గన స్వయంగా ఆ క్వారంటైన్‌లోని రోగుల యోగ క్షేమాలను నిరంతరం పర్యవేక్షించారు. కరోనా వైరస్ బారిన ప్రజలు పడకుండా స్వీయ రక్షణకు నియోజకవర్గ వ్యాప్తంగా ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన 3 లక్షల మాస్కులు, శానిటైజర్లను సొంత ఖర్చులతో ప్రజలకు పంపిణీ చేశారు. ఎప్పటికప్పుడు కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో రోగుల కోసం 3 వేల బెడ్ల స్థాయి నుంచి 5వేల బెడ్ల స్థాయికి అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఏర్పాట్లు చేసేందుకు చొరవ చూపారు. లాక్‌డౌన్ మూలంగా జీవనోపాధి కరువై తింటి గింజల కోసం ఇబ్బందులు పడుతున్న నిరుపేద, మధ్యతరగతి ప్రజల కోసం స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమం చేపట్టి ప్రజల నుంచి అభినందనలను అందుకున్నారు. అలాగే వంద పడకల ప్రభుత్వాసుపత్రిలో రోగులకు ఆక్సిజన్ సౌకర్యం లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో అప్పటికప్పుడు ఆక్సిజన్ సౌకర్యం ఏర్పాటు చేశారు. ఇలా ప్రత్యేకంగా 30 పడకలకు 24 గంటల పాటు నిరంతరంగా ఆక్సిజన్ సౌకర్యం కల్పించే ఏర్పాటు చేశారు. తనవంతు బాధ్యతగా మంత్రి బుగ్గన ప్రజల మధ్యనే ఉంటూ కష్ట సుఖాలు పాలుపంచుకొని మనోధైర్యాన్ని కలిగించి ఆనాడు అండగా నిలిచిన విషయాన్ని స్థానికులు గుర్తుచేసుకుంటున్నారు.

నాడు పరార్... నేడు మొసలి కన్నీరు

కరోనా కష్టకాలంలో విలవిలలాడుతున్న నియోజకవర్గ ప్రజలకు మనోధైర్యం కలిగించేందుకు ఇక్కడి నుంచి 50 ఏళ్ల ప్రాతినిథ్యం వహించానని చెప్పుకుంటున్న ఏ ఒక్క నాయకుడు ప్రయత్నించ లేదు. కనీసం కష్టాల్లో ఉన్న ప్రజలను పరామర్శించే తీరిక కూడా కోట్ల, కేఈ కుటుంబ సభ్యులకు లేకుండా పోయింది. నేడు ఎన్నికల వేళ అదే నాయకులు ఊరూరు తిరుగుతూ ప్రజలకు అది చేస్తాం.. ఇది చేస్తామంటూ మభ్య పెడుతున్నారు. కరోనా వ్యాప్తి చెందినప్పుడు ప్రజల బాగోగులు పట్టించుకోకుండా ఎక్కడో దాచుకున్న ఆ రెండు కుటుంబాలకు ఈ ఎన్నికల్లో గుణపాఠం చెబుతామని నియోజకవర్గ ప్రజలు చెబుతున్నారు.



ఆదోని టౌన్: గర్ల్స్ హైస్కూల్ వద్ద రోడ్‌షోలో మాట్లాడుతున్న ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి





దేవనకొండ: చెల్లిచెలిమలలో భారీగా తరలివచ్చిన ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బి.విరూపాక్షి



దొర్నిపాడు: అమ్మిరెడ్డినగరంలో ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డిని గెలిపించేందుకు మేం సిద్ధం అంటున్న మహిళలు



ఎమ్మిగనూరు రూరల్: కడివెళ్ల రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక



కోడుమూరు: అమడగుంట్లలో ఓటర్లతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సతీష్



బనగానపల్లె రూరల్: జనవాహిని తరలిరాగా బనగానపల్లెలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



పాణ్యం: కొత్తూరులో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డికి గజమాల వేస్తున్న అభిమానులు



కర్నూలు: శ్రీరాంనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్



బేతంచెర్ల: వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి



వెల్దుర్తి: సూదేపల్లెలో భారీగా తరలివచ్చిన ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



మంత్రాలయం: మాలపల్లిలో గజమాలతో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు



బొమ్మలసత్రం: పోటెత్తిన జనసందోహం మధ్య నంద్యాల 25వ వార్డులో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ప్రచారం

ప్రచార పర్వం

ప్రజలతో మమేకం



పోలింగ్‌కు ఇంకొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రచారం జోరందుకుంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఇంటింటికీ తిరుగుతూ ప్రజలతో మమేకమవుతున్నారు. తాము అధికారంలోకి వస్తే మెరుగైన సంక్షేమాన్ని అందిస్తామని హామీ ఇస్తున్నారు. పల్లెల్లో, పట్టణాల్లో రోడ్‌షోలు నిర్వహిస్తూ పారదర్శక పాలనకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. ప్రచారంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు పూలమాలలు వేస్తూ ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు.

–సాక్షినెట్‌వర్క్



మహానంది: బండిఆత్మకూరు మండలం ఎ. కోడూరులో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి గజమాల వేసిన గ్రామస్తులు, రోడ్‌షోకు భారీగా హాజరైన జనం

డ్రంకన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): మద్యం సేవించి వాహనం నడిపిన ఓ వ్యక్తికి న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. వైఎస్‌నగర్‌కు చెందిన షేక్‌మహమ్మద్ హుసేన్ మద్యం సేవించి బైక్‌పై వస్తుండగా ఎస్సార్బీసీ కాలనీ కూడలి వద్ద తాలూకా పోలీసుల డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా సెంకడ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి ఏడు రోజులు శిక్షను ఖరారు చేశారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి



సుంకయ్య (ఫైల్)

ఆలూరు రూరల్: వడదెబ్బతో బోయ కట్టే సుంకయ్య (46) అనే వ్యక్తి మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన గురువారం హొళగుంద మండలం పెద్దహ్యాట గ్రామంలో చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాలు.. సుంకయ్య గురువారం ఉదయం పొలం చూడడానికి వెళ్లాడు. మధ్యాహ్నం తిరిగి ఇంటి వచ్చి ఎండ వేడితో అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన బంధువులు హొళగుంద ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు సుంకయ్య వడదెబ్బకు తగిలిందని మెరుగైన చికిత్స కోసం ఆదోని ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడు సుంకయ్యకు భార్య ఈరమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేలా ఉన్నత విద్య

- కాంచీపురం శ్రీ చంద్రశేఖర సరస్వతీ విశ్వ మహా విద్యాలయం వైస్‌చాన్స్‌లర్ జి. శ్రీనివాస్



వర్సిటీ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ శ్రీనివాస్

కర్నూలు కల్చరల్: భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేలా ఉన్నత విద్యను అందిస్తున్నామని కాంచీపురం శ్రీ చంద్రశేఖర సరస్వతీ విశ్వ మహా విద్యాలయం (డీమ్డ్ యూనివర్సిటీ) వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ గుళ్లపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం ఓల్డ్‌సిటీలోని శంకర మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విశ్వవిద్యాలయం అందిస్తున్న కోర్సులు, అడ్మిషన్ వివరాలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు డిగ్రీ, ఇంజినీరింగ్, పోస్టు గ్రాడ్యుయేషన్ వంటి కోర్సుల్లో ఉన్నత విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. వ్యక్తి గత శ్రద్ధ, క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యా బోధన జరుగుతుందన్నారు. ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యం ఉందన్నారు. వర్సిటీ అడ్మిషన్స్ చైర్మన్, డీన్ కె. వెంకటరమణ మాట్లాడుతూ అధునాత పరిశోధన, యోగా, ఆయుర్వేదం, భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు చెందిన అంశాలపై బోధన జరుగుతుందన్నారు. వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ దండిబొట్ల నాగేశ్వరరావు , అంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య అధ్యక్షులు వెంకటరామరాజు పాల్గొన్నారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యం, బైక్‌ను మీడియాకు చూపిస్తున్న సెబ్ సీఐ భార్గవరెడ్డి

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలోని భారీగా కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక సెబ్ కార్యాలయం ఆవరణలో పట్టుబడిన మద్యం, బైక్‌ను మీడియాకు చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా మద్యం అక్రమ అమ్మకాలపై నిఘా ఉంచి దాడులు చేస్తున్నామన్నారు. మంత్రాలయం మండలం రాంపురం పంప్ హౌస్ దగ్గర వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్‌పై అక్రమంగా మద్యం తరలిస్తున్న వారిని పట్టుకున్నట్లు చెప్పారు. కోసిగి మండలం దొడ్డి బెళగల్‌కు ఈడిగ శివకుమార్, తెలంగాణ రాష్ట్రం గట్టు మండలం ఇందువాసి గ్రామానికి చెందిన గుజ్జుల నరసింహులను అరెస్ట్ చేసి వారి దగ్గర నుంచి 10 బాక్సుల్లో 960 (90ఎంఎల్) ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన మద్యం విలువ దాదాపు రూ.85,000 ఉంటుందని తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించారన్నారు. దాడుల్లో సెబ్ ఎస్‌ఐ సత్యనారాయణ, హెడ్‌కానిస్టేబుల్ లింగప్రసాద్, గోపాల్, కానిస్టేబుళ్లు నరసింహారెడ్డి, భరత్ తదతరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

రుద్రవరం: కోటకొండ గ్రామంలో గురువారం ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఇటీవల ఈదురు గాలులకు మండలంలోని పలు ప్రాంతాల్లో వ్యవసాయ పొలాల్లోని విద్యుత్ స్థంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేల కూలాయి. అయితే విద్యుత్ శాఖ అధికారులు కొన్ని చోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేసి, పునరుద్ధరణ పనులు చేపడుతున్నారు. మరికొన్ని చోట్ల అలాగే వదిలేశారు.దీంతో కోటకొండ గ్రామంలో శివశంకర్ (31)అనే రైతు గురువారం పొలం వద్ద పడిపోయిన స్తంభం పక్కన విద్యుత్ తీగలపై ప్రమాదవశాత్తూ కాలు మోపగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి సాంబశివుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

ఆదోని సెంట్రల్: కౌతాళం మండలం తోవి గ్రామానికి చెందిన ఆదోని తిక్కయ్య(49) మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నాడు. ఇస్వీ-కుప్పగల్ ఆర్‌ఎస్‌ల మధ్య లైన్ ట్రాక్ వద్ద గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్‌ఐ. గోపాల్, హెడ్ కానిస్టేబుల్ సర్వేశ్వరరావు గురువారం తెలిపారు. తీవ్ర రక్తగాయాలు కావడంతో తిక్కయ్య అక్కడికక్కడే మృతి చెందినట్లు చెప్పారు. మృతుడు తాగుడకు బానిసై ఆత్మహత్యకు పాల్పడినట్లు తమ విచారణలో తేలిందన్నారు. మృతుడికి భార్య హనుమమ్మ, నలుగురు పిల్లలు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ఒక్క పైసా ఖర్చు చేశారా?

- నిరాధార ఆరోపణలు చేయడం తగదు
- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి



అనుపూరులో చిన్నారులతో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: టీడీపీ హయాంలో ఆలయాల అభివృద్ధికి ఒక్క పైసా అయినా ఖర్చు చేశారా అని పాణ్యం ఎమ్మె ల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రశ్నించారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలతో మ మేకమవుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎస్. కొత్తూరులో ఆయన మాట్లాడుతూ ఆలయాల్లో అవినీ తి జరిగిందంటూ టీడీపీ నేతలు విమర్శలు చేస్తున్నార ని, అందుకు సాక్ష్యాలు ఉంటే బయటపెట్టాలన్నారు. నిరాధార ఆరోపణలు చేయడం తగదని హెచ్చరించారు. దాతల సహకారం, ప్రభుత్వ నిధులతో పాణ్యం నియోజకవర్గంలోని ఆలయాలను అభివృద్ధి చేశామన్నారు. ప్రముఖ ఆలయాల్లో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించామన్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనుల చేస్తే వాటిని గమనించకుండా ఆరోపణలు చేస్తే చేస్తే భక్తులు, ఓటర్లు ఉరుకోబోరన్నారు. ఆలయ భూములను ఆక్రమించి, దోచుకుంటుంది టీడీపీ నాయకులనే అన్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. నిరాధర ఆరోపణలు చేసే వారికి తాను సవాల్ చేస్తున్నానని, కొత్తూరు సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వేదికగా నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనన్నారు. యాగంటి, మద్దిలేటిస్వామి క్షేత్రాలు, నందవరం చౌడేశ్వరి అమ్మవారి దేవాలయాల్లో ఎలాంటి అవినీతికి తావులేకుండా, దేవుని సొమ్ము పరులపాలు కాకుండా తాను చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రతిపక్ష నాయకులు మాట్లాడే సమయంలో ఆలోచించుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రచారంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, పార్టీ నాయకులు రామంజనేయులు, చంద్రశేఖర్ రెడ్డి, పుల్లయ్య, జితేంద్రారెడ్డి, మనోహర్, నాగశేషుడు, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

కట్టుదిట్టంగా నిఘా



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

పాణ్యం: నంద్యాల జిల్లాలో ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా పోలీసు అధికారులు చర్యలు చేపడుతున్నారు. చెక్ పోస్టులు ఏర్పాటు చేసి అక్రమంగా నగదు, మద్యం, గంజాయి తదితర వాటిని జిల్లాలోకి ప్రవేశించకుండా నిరంతరం తనిఖీలు చేస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి అంతర్ జిల్లా చెక్‌పోస్టు అయిన తమ్మరాజుపల్లె చెక్ పోస్టును గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. పాణ్యం సీఐ నల్లప్ప ఉన్నారు.

బిల్లేకల్లులో టీడీపీ నాయకుల మధ్య ఘర్షణ

- ఇద్దరికి గాయాలు
- నలుగురిపై కేసు నమోదు

ఆస్పరి: మండలంలోని బిల్లేకల్లు గ్రామంలో టీడీపీ నాయకుల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. ఇరువర్గాలు ఘర్షణ పడగా ఇద్దరికి గాయాలు కావడంతో ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ హనుమంతప్ప తెలిపారు. ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్రగౌడ్ బంధువు అమరేష్ గౌడ్ ప్రచారం నిమిత్తం గురువారం గ్రామానికి వచ్చారు. ఇందులో భాగంగా నాయకులు, కార్యకర్తలకు భోజనం ఏర్పాట్లలో మాజీ ఎంపీపీ వెంకటేష్, మహేష్ మధ్య పోటీ ఏర్పడింది. ప్రచారం తరువాత నాయకులు, కార్యకర్తలు రెండు ప్రాంతాల్లో కొందరు చొప్పున భోజనం చేశారు. ఆ తరువాత అమరేష్ గౌడ్‌కు సన్మానం చేసే విషయంలో రెండు వర్గాలు పోటీ పడ్డాయి. తామే ముందు సన్మానం చేస్తామంటూ వాగ్వాదానికి దిగి చివరకు దాడులు చేసుకున్నారు. ఇందులో మహేష్ వర్గానికి చెందిన బాట వీరేష్, లక్ష్మన్నపై వెంకటేష్ వర్గానికి చెందిన నాగరాజు, వీరేష్, రాముడు, రామాంజిని మరికొందరు దాడి చేసి గాయపరిచారు. బాట వీరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

వైఎస్సార్‌సీపీకే మాదిగల మద్దతు



మాట్లాడుతున్న దండువీరయ్య మాదిగ

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లాలోని నంద్యాల, శ్రీశైలం, బనగానపల్లె నియోజకవర్గాల్లోని మాదిగలు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతు ఇస్తున్నట్లు ఏపీ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య మాదిగ ప్రకటించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కోటేష్ మాదిగ అధ్యక్షతన గురువారం స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. దండు వీరయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాదిగలకు చేసిన సాయాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో మాదిగలు వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. కోటేష్ మాదిగ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి నంద్యాల నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరతారని చెప్పారు. రాధమ్మ, రాణి పాల్గొన్నారు.

టీడీపీ నాయకులపై కేసు నమోదు

చాగలమర్రి: గత నెల 22న స్థానిక మహబూబ్ థియేటర్ వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ కార్యకర్తలతో వెళ్తున్న ఆళ్లగడ్డ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి గంగుల బిజేంద్రారెడ్డిని రెచ్చగొట్టేలా, అవమానించేలా, కవ్వింపు చర్యలకు పాల్పడిన 8 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమణయ్య గురువారం తెలిపారు. వివరాలు.. గత నెల 22న గ్రామంలో ఇంటింటి ప్రచారంలో భాగంగా గంగుల బిజేంద్రారెడ్డి ర్యాలీగా వెళ్తుండగా..అక్కడున్న టీడీపీ కార్యకర్తలు మౌలాలి, రఫీ, షఫీ, మగ్బుల్, ఖలీల్, మాబుసున్న, అబ్దుల్ రజాక్ రెచ్చగొట్టేలా వ్యవహరించారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

వివాహిత బలవన్మరణం



ఈరమ్మ (ఫైల్)

హాలహర్వి: మండలంలోని బిలేహాల్ గ్రామానికి చెందిన ఈరమ్మ (23) భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్ఐ నరేంద్ర తెలిపారు. గ్రామానికి చెందిన హనుమేష్‌కు రాయచూరు జిల్లా మాన్వి తాలూకా కురిడి గ్రామానికి చెందిన ఈరమ్మను నాలుగేళ్ల క్రితం ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు పిల్లలు. కొన్ని రోజులుగా భర్త వేధింపులు అధికమవడంతో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

ఊపిరి పోసి.. సేవలు మెరిసి!

- ప్రభుత్వాస్పత్రుల్లో ఖాళీ పోస్టులన్నీ భర్తీ
- కర్నూలు మెడికల్ కళాశాలలో 126 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం
- 54 మంది వైద్యులకు పదోన్నతి
- వైద్య ఆరోగ్య శాఖలో 2 వేలకుపైగా ఉద్యోగుల నియామకం
- కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో 385 మందికి ఉద్యోగాలు
- ఫలితంగా రోగులకు మెరుగైన వైద్య సేవలు
- మెడికల్ కళాశాలలో అదనపు పీజీ సీట్లు మంజూరు

వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చింది. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో వైద్య శాఖలో ఖాళీగా ఉన్న అన్నీ పోస్టులను భర్తీ చేసింది. గతంలో చిన్న రోగానికి కూడా జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ఈ సమస్యకు పరిష్కారంగా వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లను ఏర్పాటు చేసింది. అందులో బీఎస్సీ నర్సింగ్ చేసిన వారిని నియమించింది. ఫలితంగా స్థానికంగానే వైద్య సేవలు అందుతున్నాయి. దీనికి తోడు ఆయా ప్రభుత్వాస్పత్రుల్లో అవసరమైన అదనపు పోస్టులను సృష్టించి మరీ సిబ్బందిని నియమించింది. ప్రభుత్వం వచ్చాక ఏ ఒక్కరి ఉద్యోగం తొలగించకపోగా ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపింది.



కర్నూలు(హాస్పిటల్): వైద్యరంగంలో పోస్టులు ఖాళీగా ఉండకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు నోటిఫికేషన్లు విడుదల చేస్తూ భర్తీ చేస్తోంది. జిల్లాలో వెయ్యికిపైగా ఉన్న వార్డు/గ్రామ సచివాలయాల్లో ఏఎన్‌ఎంలను నియమించి వైద్య ఆరోగ్యశాఖకు అప్పగించింది. వీరు సచివాలయాల పరిధిలో ఆరోగ్య కార్యక్రమాలను పర్యవేక్షించడమే కాకుండా ప్రాథమిక చికిత్సను అందిస్తున్నారు. గ్రామాల్లో వారి పరిధిలోకి వచ్చే ఫ్యామిలి ఫిజీషియన్ సేవలు, ఆరోగ్యశ్రీ సేవలు దగ్గరుండి మరీ చూసుకుంటున్నారు. వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో 600 మందికి పైగా బీఎస్సీ నర్సింగ్ విద్యను పూర్తి చేసిన నర్సులు మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా వైద్యుల పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం ఆయా గ్రామాలకు వైద్యపరంగా వారే పెద్ద దిక్కుగా మారారు. వారి పరిధిలో లేకపోతే టెలిమెడిసిన్ ద్వారా పీహెచ్‌సీ లేదా జిల్లా కేంద్రంలోని టెలిమెడిసిన్ హబ్‌కు వీడియోకాల్ చేసి మరీ వైద్యం అందేలా చేస్తున్నారు. దీని వల్ల చిన్న జబ్బులకు జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా చేశారు.

వైద్య ఆరోగ్యశాఖలో 2వేల పోస్టుల భర్తీ

మూడేళ్లుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో నిత్యం ఏదో ఒక నోటిఫికేషన్‌కు సంబంధించి ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. ఆ శాఖలో సగం మంది ఉద్యోగులు ఈ పనిపైనే అధిక శాతం ఉంటున్నారంటే అతిశయోక్తి కాదు. జిల్లాలో మొత్తం 44 అర్బన్‌హెల్త్ సెంటర్లలో ఒక్కో దాంట్లో ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక మెడికల్ ఆఫీసర్, ఒక ల్యాబ్‌టెక్నీషియన్, ఒక ఫార్మాసిస్టు, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, ఒక ఎల్‌జీఎస్ కలిపి మొత్తం 308 పోస్టులు భర్తీ చేశారు. అలాగే ఎస్‌ఎన్‌సీయుల్లో 28 స్టాఫ్‌నర్సు పోస్టులు, 29 ఎన్‌బీసీయూ స్టాఫ్‌నర్సు పోస్టులు, నలుగురు సపోర్టింగ్ స్టాఫ్ పోస్టులు భర్తీ చేశారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో 203 స్టాఫ్‌నర్సు పోస్టులు, 100కు పైగా మెడికల్ ఆఫీసర్లు, 96 స్టాఫ్ నర్సులు, 22 ల్యాబ్‌టెక్నీషియన్లు, 26 ఎంఎన్‌ఓలు, 925 సచివాలయ ఏఎన్‌ఎంలు, 74 ఎఫ్ఎన్‌ఓలు, 8 ఎస్‌ఏడబ్ల్యూ పోస్టులు భర్తీ అయ్యాయి.



వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం

కేఎంసీలో పోస్టులన్నీ ఫుల్

కర్నూలు మెడికల్ కాలేజీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వైద్యుల నియామకాలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. ముందుగా దీర్ఘకాలంగా ఒకేచోట ఉన్న వైద్యులను బదిలీ చేసింది. అనంతరం అర్హులైన వైద్యులకు పదోన్నతులు కల్పించింది. ఇందులో భాగంగా 32 మందిని అసిస్టెంట్ ప్రొఫెసర్ నుంచి అసోసియేట్ ప్రొఫెసర్లుగా, 22 మందిని అసోసియేట్ ప్రొఫెసర్ నుంచి ప్రొఫెసర్లుగా పదోన్నతులు ఇచ్చింది. ఈ మేరకు ఖాళీగా ఉన్న స్థానాల్లో వారిని భర్తీ చేసింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేసింది. ఈ ఏడాది ఏకంగా 126 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు కర్నూలు మెడికల్ కాలేజీలో అడుగు పెట్టారు. దీంతో ప్రస్తుతం ఇక్కడ ప్రొఫెసర్లు 73, అసోసియేట్ ప్రొఫెసర్లు 69, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 226 మంది ఉన్నారు. కళాశాలలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి ఆయా విభాగాలకు 45 పీజీ సీట్లు అదనంగా మంజూరయ్యాయి. ఇందులో రెండు సూపర్‌స్పెషాలిటీ విభాగాలు కూడా ఉన్నాయి. వైద్యులతో పాటు మూడు డేటా ఎంట్రీ ఆపరేటర్లు, 16 ల్యాబ్‌టెక్నీషియన్లు, ఒక ఫార్మాసిస్టు, నాలుగు ల్యాబ్ అటెండెంట్లు, ఒక ఎఫ్ఎన్‌ఓ, ఒక ఎంఎన్‌ఓ, రెండు ఆయా, ఆరు సబార్డినేట్, ఒక స్వీపర్ పోస్టులనూ భర్తీ చేశారు.

పెద్దాస్పత్రిలో ఒక్క ఏడాదిలోనే 385 పోస్టుల భర్తీ

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో 2021 ఏడాదిలో వివిధ కేడర్లలో 385 పోస్టులు భర్తీ అయ్యాయి. అందులో స్టాఫ్‌నర్సులు 298, గ్రేడ్-2 ఫార్మాసిస్టు 15, రిసెప్షనిస్టు కమ్ క్లర్క్ 3, చైల్డ్ సైకాలజిస్టు 1, ఫిజియోథెరపిస్ట్ 2, థియేటర్ అసిస్టెంట్ 6, గ్రేడ్-2 ల్యాబ్‌టెక్నీషియన్ 19, రేడియోగ్రాఫర్ 1, డేటా ఎంట్రీ ఆపరేటర్స్ 3, బయోమెడికల్ ఇంజినీర్ 1, రేడియేషన్ సేఫ్టీ ఆఫీసర్స్ 1, కార్డియాలజీ టెక్నీషియన్ 1, డెంటల్ టెక్నీషియన్ 1, డార్క్‌రూమ్ అసిస్టెంట్ 4, అసిస్టెంట్ ఎలక్ట్రికల్ 1, ఎక్స్‌రే అటెండెంట్ 1, ఆప్టొమెట్రిస్ట్ 1, కేథలాబ్ టెక్నీషియన్ 2, స్పీచ్‌థెరపిస్ట్ 2, ఎంఆర్‌ఐ టెక్నీషియన్ 2, సీటీ టెక్నీషియన్ 2, డయాలసిస్ టెక్నీషియన్ 5, ఆడియోమెట్రి టెక్నీషీయన్ 1, మేల్ నర్సింగ్ ఆర్డర్లీ 4, స్ట్రెచ్చర్ బేరర్ 6, అటెండర్స్ 2 పోస్టులున్నాయి.



కర్నూలు మెడికల్ కాలేజీ

డోన్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దా

- విద్యాలయాలు, ఉపాధి శిక్షణ కేంద్రాలతో బేతంచెర్లకు కొత్త శోభ
- విద్య, వైద్యం, రహదారులు, తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి
- ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



బేతంచెర్లలో మాట్లాడుతున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

బేతంచెర్ల: అన్ని రంగాల్లో డోన్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దామని ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో బేతంచెర్లకు చెందిన బ్రహ్మణ పెద్దలు మారుతి కృష్ణ, అన్నారావుతో సమావేశమయ్యారు. అనంతరం పట్టణంలోని అమ్మవారిశాల్లో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు కందగడ్డల జనార్దన్, సంఘం నాయకులు కొప్పరపు శేషా మోహన్, గురవయ్య, బళ్లాని సూర్య ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో రెండేళ్ల కరోనా సమయం మినహా మిగిలిన మూడేళ్లలో డోన్ నియోజకవర్గాన్ని 30 ఏళ్ల అభివృద్ధి చేశామన్నారు. రూ. 351 కోట్లతో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా, జాతీయ రహదారులు, గ్రామీణ రోడ్లు, డబుల్ రోడ్లు ఏర్పాటు చేశామన్నారు. మద్దిలేటి నరసింహస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడంతో ఏడాదికి రూ. 12 కోట్ల ఆదాయానికి చేరుకుందని తెలిపారు. ఎలాంటి స్వార్థం లేకుండా సమాజ సేవే ప్రథమ కర్తవ్యంగా భావించడంతోనే ఇంత అభివృద్ధి సాధ్యమైందన్నారు. ఓర్వకల్ ఎయిర్‌పోర్టు అభివృద్ధితోపాటు గాజులదిన్నె ప్రాజెక్టును 3 టీఎంసీలకు పెంచామన్నారు. రూ.100 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. కర్నూలులో రూ.600 కోట్లతో న్యాయ విశ్వవిద్యాలయానికి పూనాది రాయి వేశామన్నారు. నంద్యాల, జమ్మలమడుగు, డోన్‌లకు జాతీయ రహదారులను సాధించుకున్నామని తెలిపారు. ఇంత అభివృద్ధి జరిగినా టీడీపీ నాయకులకు మాత్రం కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్య ప్రకాశ్‌రెడ్డి 3 సార్లు ఎంపీ, ఒకసారి కేంద్ర మంత్రిగా పనిచేసినా సొంతూరు లద్దగిరికి సరైన రహదారి ఏర్పాటు చేయలేకపోయారని విమర్శించారు. ప్రశాంతంగా ఉండే డోన్‌లో ఆ పార్టీ నాయకులు గొడవలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. అసలు ఆ పార్టీ నాయకుల వల్ల ప్రజలకు ఏం ఉపయోగమని ప్రశ్నించారు. అభివృద్ధి ఇలానే కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీ ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. బుగ్గనకు అండగా ఉంటామని ఆర్యవైశ్యులు తెలిపారు.



బేతంచెర్లలో బ్రాహ్మణులతో సమావేశమైన మంత్రి బుగ్గన

వైఎస్సార్‌సీపీలో చేరిక

నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి ఆధ్వర్యంలో బేతంచెర్లకు చెందిన 15 కుటుంబాలు బుగ్గన సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

అవాంఛనీయ ఘటనలకు తావివ్వొద్దు



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ నాగరాజు

ఎమ్మిగనూరురూరల్: ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రశాంతంగా జరిగేలా చూడాలని అడిషనల్ ఎస్పీ నాగరాజు సూచించారు. గురువారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ సీతారామయ్య ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు టౌన్, రూరల్, గోనెగండ్ల, మంత్రాలయం, కోసిగి, సెబ్ సీఐలు, ఎస్ఐలతో సమావేశం నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గ్రామాల్లో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయాలు జరగకుండా నిరోధించాలని, అలాగే చెక్ పోస్టల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని చెప్పారు. సరిహద్దు చెక్ పోస్టల వద్ద నిఘా పెంచాలని, ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. సీఐలు మధుసూదన్‌రావు, మోహన్‌రెడ్డి, రామకృష్ణయ్య, ఎరిసావలి, ప్రసాద్, ఎస్ఐలు, సెబ్ సీఐలు, మాధవరం, బాపురం చెక్ పోస్ట్ అధికారులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం సరఫరాపై ఉక్కుపాదం

- డీఎస్పీ శివనారాయణస్వామి
- కర్ణాటక మద్యం తరలిస్తున్న నలుగురి అరెస్ట్



పట్టుబడిన మద్యాన్ని చూపుతూ వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి

ఆదోని రూరల్: కర్ణాటక మద్యం సరఫరాపై ఉక్కుపాదం మోపుతామని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడిన నిందితుల వివరాలను ఇస్వీ పోలీస్‌స్టేషన్‌లో వివరించారు. ఆయన మాట్లాడుతూ.. గురువారం సాయంత్రం మండలంలోని సంతెకూడ్లూరు చెక్ పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కర్ణాటక రాష్ట్రం సిరుగుప్ప తాలూకా నాగరహాల్ గ్రామంలోని వైన్‌షాపులో కర్ణాటక మద్యాన్ని కొనుగోలు చేసి మోటారు సైకిళ్లపై తరలిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఇందులో ఆదోని పట్టణంలోని అమరావతినగర్‌కు చెందిన ఈడిగ అంజి, వాల్మీకినగర్‌కు చెందిన బోయ వినోద్, వాల్మీకి నగర్‌కు చెందిన బోయ నీలకంఠ, అరుణ్‌జ్యోతినగర్‌కు చెందిన బండారి చిన్నా నుంచి కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నామని, అయితే బోయగేరికి చెందిన బోయ రామయ్య పారిపోయాడని చెప్పారు. మద్యం తరలింపునకు ఉపయోగించిన మోటారు సైకిళ్లు 90 ఎం.ఎల్. పరిమాణం గల కర్ణాటక ఒరిజినల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ 4800 టెట్రా ప్యాకెట్లు సీజ్ చేశామని వివరించారు. తాలూకా సీఐ నిరంజన్‌రెడ్డి, ఇస్వీ ఎస్ఐ శ్రీనివాసులు, ఏఎస్ఐ చంద్ర, హెడ్ కానిస్టేబుల్ బషీర్‌అహ్మద్, కానిస్టేబుల్ తిప్పన్న, సుదర్శన్, రామచంద్ర, నాగేంద్ర, ప్రసాద్, నాగరాజు, సుధాకర్ పాల్గొన్నారు.

బాబును నమ్మితే నట్టేట ముంచేస్తాడు



మల్యాలలో ప్రజలు, నాయకులతో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డి

- తప్పుడు హామీలతో ప్రజల ముందుకు కూటమి నేతలు
- జగనన్నను నమ్మండి.. పథకాలు మళ్లీ ఇంటికి వస్తాయి
- వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డి

నందికొట్కూరు రూరల్ : జిమ్మిక్కుల చంద్రబాబు మేనిఫెస్టో ఎన్నికలయ్యేంత వరకు అందరికీ చూపిస్తారని, ఆ తరువాత దాన్ని మాయం చేస్తారని నంద్యాల వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బైరెడ్డి మల్లికార్జునరెడ్డితో కలిసి ఆయన మండలంలోని గ్రామాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ అధికారం కోసం అబద్ధాలు చెప్పడం, మోసాలు చేయడం చంద్రబాబుకు అలవాటుగా మారిందని అన్నారు. అమలుకు సాధ్యం కాని హామీలు ఇస్తూ ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారన్నారు. ప్రజలు వాటిని నమ్మొద్దని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇస్తే కచ్చితంగా వాటిని నెరవేరుస్తారన్నారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు రవియాదవ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కేశవరెడ్డి, శాతనకోట సర్పంచ్ జనార్దన్‌గౌడ్, మల్యాల సర్పంచ్ ఉమాదేవి, జేసీఎస్ కన్వీనర్ ఓంకార్‌రెడ్డి, గ్రామ నాయకులు ఎల్లనాయుడు, శ్రీనివాసులు, చంద్రశేఖర్, సగినేల వృశేనయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా



పోలీస్ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ హిమాన్సుశంకర్ త్రివేది

పగిద్యాల: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ హిమాన్షు శంకర్ త్రివేది పోలీస్ సిబ్బందికి ఆదేశించారు. గురువారం మండలంలోని నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి, గ్రామాల్లో ఏర్పాటు చేసిన 1,2,3,5, 91,92,93 పోలింగ్‌లను ఆయన పరిశీలించారు.
మిడుతూరు: మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన చెరుకుచెర్ల, వీపనగండ్ల గ్రామాలను, రోళ్లపాడు చెక్‌పోస్టును ఎన్నిలక పోలీస్ అబ్జర్వర్ హిమాన్షు శంకర్ త్రివేది సందర్శించారు.
నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని కోళ్లబావాపురం వద్దనున్న అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును పోలీస్ అబ్జర్వర్ హిమన్ష్ శంకర్ తనిఖీ చేశారు. ఆయన వెంట ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, నందికొట్కూరు అర్బన్ సీఐ ప్రకాష్, ఎస్ఐలు ఉన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుల అరెస్టు

బనగానపల్లె రూరల్:నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని పలుకూరు గ్రామానికి చెందిన బెల్ట్ షాపు నిర్వాహకులు చాకలినవీన్, కురవ సురేష్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ గురువారం తెలిపారు. బనగానపల్లె వైపు నుంచి గ్రామానికి మోటార్ సైకిల్‌పై మద్యం తరలిస్తుండగా దేవనగర్ గ్రామంలో వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. 48 మద్యం బాటిళ్లు, మోటార్ సైకిల్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసి ముద్దాయిలను కోర్టులో హాజరు పరచినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో ఫైర్ సేఫ్టీ తప్పనిసరి



ఓ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఫైర్ సేఫ్టీ తప్పనిసరిగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర సంచాలకుల ఆదేశాల మేరకు గురువారం నగరంలోని మాధవీనగర్ అమ్మ హాస్పిటల్, నిత్యా మల్టీ స్పెషాలిటీ క్లినిక్ అండ్ డయాగ్నోస్టిక్ సెంటర్, సహాయ డయాగ్నోస్టిక్ సెంటర్‌లను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రుల్లో ఫైర్ ఎన్‌ఓసీ, 50 వేల లీటర్ల సామర్థ్యం గల నీటిట్యాంక్, తాగునీటి వసతి కల్పించాలని, విద్యుత్ సంబంధిత వైరింగ్ సక్రమంగా ఉండేటట్లు చూసుకోవాలని, అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్‌డ్రిల్ నిర్వహించాలని చెప్పారు. వడదెబ్బతో వచ్చే వారికి చికిత్స నిమిత్తం కూల్ పాడ్స్ అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ప్రాజెక్ట్ నిస్టు ఖలీల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపాదిళ్ల ఘటనలో 31 మందిపై కేసులు నమోదు

ప్యాపిలి: మండల పరిధిలోని పెద్దపాదిళ్లలో బుధవారం జరిగిన ఘర్షణలో 31 మందిపై కేసులు నమోదు చేసినట్లు ప్యాపిలి ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి గురువారం తెలిపారు. డోన్ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి ప్రచారంలో టీడీపీకి చెందిన రెండు వర్గాలు పరస్పరం దాడులు చేసుకోగా కారకులను గుర్తించి కేసు నమోదు చేశామన్నారు. ఓ వర్గంలో ప్రసాద్‌రెడ్డితో పాటు 13 మందిపై, మరో వర్గంలో మహేశ్‌తో పాటు 18 మందిపై న్యూసెన్స్ కేసు నమో దు చేశామన్నారు. అలాగే ప్రసాద్ రెడ్డితో పాటు మరో 9 మందిపై, మహేశ్‌తో పాటు 17 మందిపై బైండోవర్ కేసు నమోదు చేసి మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచినట్లు ఆయన తెలిపారు.

సీటు.. రైట్

- పేద విద్యార్థులకు ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశం
- జిల్లా వ్యాప్తంగా 960 మందికి లబ్ధి
- మొదటి జాబితాను విడుదల చేసిన విద్యాశాఖ
- 10వ తేదీ లోపు పాఠశాలల్లో అడ్మిషన్ పొందాలి

నంద్యాల(న్యూటౌన్): ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం సెక్షన్ 12(1)(సి) ప్రకారం ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 20 శాతం సీట్లు ఇవ్వాలి. ఈ చట్టాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేస్తుండటంతో పేద విద్యార్థులు జిల్లాలోని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో అడ్మిషన్లు పొందుతున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో పేద విద్యార్థుల ప్రవేశానికి మొదటి విడత జాబితాను విద్యాశాఖ విడుదల చేసింది. 2002-23 విద్యా సంవత్సరంలో 335 పాఠశాలల్లో 221 మందికి ప్రవేశాలు కల్పించగా, గత విద్యా సంవత్సరంలో 213 ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో మూడు విడతల్లో 535 మంది పేద విద్యార్థులకు జిల్లా వ్యాప్తంగా ఒకటో తరగతిలో ప్రవేశాలు కల్పించారు. ఇక 2024-25 విద్యా సంవత్సరానికి 1,750 మంది దరఖాస్తు చేసుకోగా, 960 మంది తల్లిదండ్రులు పాఠశాలలను అప్‌డేట్ చేసుకున్నారు. వారికి జిల్లాలోని వివిధ మండలాల్లో ప్రవేశాలు కల్పిస్తూ సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు మొదటి విడత జాబితా బుధవారం విడుదల చేశారు.

జిల్లా వ్యాప్తంగా...

నంద్యాల జిల్లాలో విద్యా హక్కు చట్టం ప్రకారం ఐబీ/ఐసీఎస్‌ఈ/సీబీఎస్‌ఈ స్టేట్ సిలబస్ అమలవుతున్న 335 ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలలు సీఎస్‌ఈ వెబ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్నాయి. వాటిల్లో మొదటి విడతలో భాగంగా 292 మంది బీసీ విద్యార్థులు, 172 మంది మైనార్టీలు, 106 మంది ఓసీలు, 364 మంది ఎస్సీలు, 23మంది ఎస్టీ విద్యార్థులకు సీట్లు కేటాయించారు. వీరంతా ఈనెల 10వ తేదీ లోపు ఆయా పాఠశాలల్లో అడ్మిషన్లు పొందాలని విద్యార్థుల తల్లిదండ్రుల సెల్‌ఫోన్లకు విద్యాశాఖాధికారులు సమాచారం చేరవేశారు.

జాబితా విడుదలైంది



విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో పేద విద్యార్థుల ప్రవేశానికి మొదటి విడత జాబితాను రాష్ట్ర విద్యాశాఖాధికారులు బుధవారం రాత్రి విడుదల చేశారు. గత విద్యా సంవత్సరంలో కూడా 1వ తరగతిలో పేద విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాం. ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలలకు ఈ చట్టంపై అవగాహన ఉంది. నిర్దేశించిన తేదీలోపు ప్రవేశాలు పొందాలి.

–సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల